సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 5 । మార్చి । 2023



గంజాయి అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ల ఆటకట్టు
గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు చేస్తున్న అంతర్ రాష్ట్ర స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. 28 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. -8లో



హార్సిలీహిల్స్ అడవిలో మంటలు
పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ కొత్త వ్యూపాయింట్ సమీపంలో ఆకతాయిల ఆగడాల వల్ల మంటలు చెలరేగాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 194 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	463	619
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 225.54 కిలోలు

న్యూస్‌రీల్

6న 'స్పందన' రద్దు

రాయచోటి: ఈనెల 6వ తేదీ సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశారు. ఈమేరకు శనివారం కలెక్టర్ కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటనలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా జిల్లా అధికారులు ఆయా విధుల్లో పాల్గొనాల్సి ఉంది. అందువల్ల స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

పారిశ్రామిక ప్రగతికి కృషి
– జిల్లాకలెక్టర్ గిరీషా పీఎస్



కాకులారం గ్రామంలో భూమికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా

రామాపురం : పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రామాపురం మండలంలోని కాకులారం గ్రామంలో సర్వే నంబరు 628/2లో 96.8 ఎకరాలు, బండపల్లి గ్రామంలో సర్వే నంబరు 324లో 108.15ఎకరాలు ప్రభుత్వ భూమిని పరిశీలించారు. రాయచోటి నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) ద్వారా వివిధ పరిశ్రమలు స్థాపించి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి నియోజకవర్గంలో 500 నుంచి 1000 ఎకరాలు ప్రభుత్వ భూమిని గుర్తించాలని సంబంధిత తహశీల్దార్లకు జిల్లా కలెక్టర్ ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, రామాపురం తహశీల్దార్ సత్యానందం, ఆర్ఐ రవికుమార్, సర్వేయరు ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

ఒకే మాట.. ఒకే బాట

- బ్రహ్మోత్సవాల వేళ మాంసం విక్రయాలు, వినియోగం నిషేధం
- సంప్రదాయాలు పాటిస్తున్న ముస్లింలు
- ఆదర్శంగా నిలుస్తున్న 24 గ్రామాల ప్రజలు



బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహనాల్లో కొలువుదీరి గ్రామంలో ఊరేగుతున్న స్వామివారు

గుర్రంకొండ : ఆధునిక సమాజమలో తరాలు మారుతున్నా సంస్కృతి, సంప్రదాయలు సజీవంగానే ఉన్నాయనేందుకు తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలే నిదర్శనం. స్వామివారి బ్రహోత్సవాలు జరిగే 11 రోజుల పాటు తరిగొండ పంచాయతీలోని గ్రామాలు, పరిసర 24 గ్రామాల ప్రజల ఒకే మాట మీద నిలబడి సంస్కృతి, సంప్రదాయాలను నేటికి పాటిస్తున్నారు. గ్రామాల్లో జంతువధ, మాంసం విక్రయాల వినియోగం పూర్తిగా నిషేధం. ఈసంప్రదాయాన్ని కేవలం హిందువులు మాత్రమే కాకుండా ముస్లింలు కూడా ఆచరిస్తుండడం విశేషం.బ్రహోత్సవాలు జరిగే సమయాల్లో ఘాటు వస్తువులైన ఎండు మిర్చి, ధనియాలు వంటివి పిండిమిషన్లలో ఆడించడం లేదా ఇళ్లలోని రోళ్లలో దంచడం వంటివి చేయక పోవడం గమనార్హం.

కంకణధారణతో నిబంధనలు అమలు

స్వామివారి బ్రహోత్సవాలు ప్రారంభంరోజున నిర్వహించే అంకురార్పణలో అర్చకులు కంకణాలు కట్టడం సంప్రదాయం. అప్పటి నుంచి నిబంధనలు మొదలవుతాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు స్వామివారు ఉదయం, సాయంకాలం వాహనాల్లో ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో విహరిస్తారు. ప్రతిరోజు, వీధులు పరిశుభ్రంగా ఉంటాయి. ఇందుకోసం ప్రత్యేక పారిశుధ్య కార్మికులు ఉంటారు.

ఘాటు వస్తువులకు దూరం

గ్రామాల్లో ఎండుమిర్చి, ధనియాలు వంటి ఘాటు వస్తువులకు ప్రజలు దూరంగా ఉంటారు. ఉగ్ర నారసింహుడైన స్వామివారు బ్రహోత్సవాల వేళ గ్రామంలో వాహనాల్లో ఊరేగింపుగా వచ్చే సమయంలో ఘాటు వస్తువుల వాసనాలు రాకూడదనేది ఇక్కడి ప్రజల నమ్మకం. ఆయా గ్రామాల్లో ఎలాంటి శుభ కార్యాలు నిర్వహించరు. పెళ్లిళ్లకు మంచి ముహుర్తాలు ఉన్నాకానీ వివాహాలు జరిపించరు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.ఆ సమయంలో సాధారణ ప్రజలు పెళ్లిళ్ల చేసుకోకూడదనేది ఇక్కడి ఆచారం. కనీసం ఇళ్లముందుపందిళ్లు కూడా వేసుకోరు.ప్రతి ఒక్కరూ కల్యాణం రోజు ఉపవాసాలు ఉండడం ఆనవాయితీగా వస్తోంది. తరిగొండ,పరిసర గ్రామాల్లో హిందువులతో పాటు ముస్లింలు ఈ సంప్రదాయాలను పాటిస్తుండడం విశేషం. గ్రామంలో 1500 మంది ముస్లింలు నివాసం ఉంటున్నారు. బ్రహోత్సవాల సమయంలో మాంసం దుకాణాలు మూసివేస్తారు. హిందువుల సంప్రదాయాలను గౌరవిస్తూ, పరమత సహనం పాటిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా ఇక్కడి ముస్లింలు నిలుస్తున్నారు.

జంతు వధ నిషేధం

బ్రహ్మోత్సవాల వేళ తరిగొండతో పాటు పరిసర 24 గ్రామాల్లో జంతు వధ నిషేధం. స్వామివారు గ్రామంలో వివిధ వాహనాల్లో సంచరిస్తాడు. ఆ సమయంలో ఎక్కడ కుడా రక్తపు మరకలు ఇళ్ల ముందుగానీ, వీధుల్లో గానీ కనిపిస్తే స్వామివారి ఆగ్రహానికి గురికావడమే కాకుండా ఆయా గ్రామాలకు కీడు జరుగుతుందనేది పెద్దల నమ్మకం. దీంతో ఎక్కడ కూడా జంతు బలులు, వధ నిర్వహించరు.



మూతపడిన చికెన్, మటన్ దుకాణాలు

చికెన్ దుకాణాలను మూసివేస్తాం



స్వామివారి బ్రహోత్సవాలు జరిగే 11 రోజుల పాటు గ్రామంలో చికెన్, మటన్ దుకాణాలను మూసివేస్తాం. చికెన్ విక్రయాలు ఇక్కడ నిర్వహించం. స్వామివారు ప్రతిరోజు తమ దుకాణాల ముందు వాహనాల్లో వెళుతుంటారు. ఆ సమయంలో రక్తపు మరకలు ఉండకూడదనేది ఇక్కడి సంప్రదాయం. దీంతో తాము కూడా వారి సంప్రదాయాలను గౌరవిస్తూ మాంసపు దుకాణాలను మూసివేస్తాం.
– మస్తాన్, చికెన్ సెంటర్ నిర్వాహకుడు, తరిగొండ

ఆనవాయితీ కొనసాగుతోంది



స్వామివారి బ్రహోత్సవాలు జరిగే రోజుల్లో గ్రామంలో ఘాటు వస్తువులైన ఎండుమిర్చి, ధనియాలు వంటి వాటి పొడులు తయారు చేడయడం ఇక్కడ నిషేధం. పిండిమిషన్లలో కూడా వీటి పొడులను తయారు చేయరు. ఇళ్లలో స్త్రీలు కూడా రోళ్లలో వీటిని వేసి దంచరు. ఇలా చేయడం ఆనవాయితీగా వస్తోంది.
– సురేష్, తరిగొండ.

సంప్రదాయాలు పాటిస్తున్నారు



స్వామివారి బ్రహోత్సవాలు జరిగే అన్ని రోజుల్లో హిందువులే కాకుండా ముస్లింలు కూడా ఇక్కడి సంప్రదాయాలను గౌరవిస్తారు. మాంసం విక్రయాలకు దూరంగా ఉంటారు. స్వామివారికి రక్తపు మరకలు పడవు. దీంతో గ్రామాల్లో జంతు వధ నిషేధం. ఎన్ని తరాలూ మారుతున్నా బ్రహోత్సవాల సమయంలో ఇక్కడి ప్రజలు సంప్రదాయాలను పాటిస్తుంటారు.
– గోపాల బట్టర్, ఆలయప్రధానఅర్చకులు, తరిగొండ

వైభవం.. తిరుచ్చి ఉత్సవం

గజవాహనంపై లక్ష్మీనరసింహుడి విహారం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి గజవాహనంపై విహరించారు. స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన శనివారం ఉదయం మూలవర్లకు తోమాల సేవ నిర్వహించారు. తిరుచ్చి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామివారిని తిరుచ్చి వాహనంలో కొలువు దీర్చారు. మేళతాళాలు, నృత్యాల మధ్య ఊరేగింపు వైభవంగా సాగింది. ఆలయంలో స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంకాలం స్వామివారు గజవాహనంలో పురువీధుల్లో విహరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని తరించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం:

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం జరగనుంది. ఈసందర్భంగా స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. సాయంకాలం సర్వభూపాల వాహన సేవ, రాత్రి గరుడవాహనం సేవ ఉంటాయి, కల్యాణోత్సవం రోజునే తిరునాల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



పల్లకిలో విహరిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి

సంక్షేమ వసతికి చార్జింగ్

- డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచుతూ జీఓ
- జూన్ నుంచి అమలు
- విద్యార్థుల తల్లిదండ్రుల హర్షం

సంక్షేమ వసతి గృహాలు	:55
విద్యార్థులు	:4,000
బీసీ సంక్షేమ ప్రీ మెట్రిక్ వసతి గృహాలు	:33
పోస్టుమెట్రిక్	:12
ప్రీ మెట్రిక్ వసతిగృహాల్లోని విద్యార్థులు	:2,704
పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో	:900



మదనపల్లె బీసీ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

డైట్ చార్జీలు ఇలా...

తరగతులు	ప్రస్తుతం	పెంపు
3,4	రూ. 1,000	రూ.1,150
5 నుంచి 10	రూ.1,250	రూ.1,400
ఇంటర్ ఆపై..	రూ.1,400	రూ.1,600

కాస్మొటిక్ చార్జీలు

	ప్రస్తుతం	పెంపు
3 నుంచి 6		
బాలురు	రూ.100	రూ.125
బాలికలుల	రూ.110	రూ.130
7 నుంచి 10		
బాలురు	రూ.125	రూ.150
బాలికలు	రూ.160	రూ.200
ఇంటర్ ఆపైన..		
బాలురు	రూ.125	రూ.200
బాలికలు	రూ.160	రూ.250

మదనపల్లె సిటీ : నాడు–నేడుతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, జగనన్న విదేశీ విద్య వంటి పథకాలతో పాఠశాల, కళాశాల విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. తాజాగా సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న వారికి మేలు చేసేలా డైట్, కాస్మొటిక్స్ చార్జీలు పెంచింది. జిల్లాలో వేలాది మంది విద్యార్థులకు మెరుగైన సౌకార్యలు కల్పించేందుకు అవకాశం ఏర్పడింది.

జూన్ నుంచి అమలులోకి...

జిల్లాలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. పాఠశాల స్థాయి నుంచి కాలేజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు నెలవారీ డైట్, కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం అందిస్తోంది. పాఠశాలలు, కాలేజీల్లో చదువుకుంటుటన్న వారికి ఇప్పుడు అందిస్తున్న డైట్ చార్జీలకు అదనంగా విద్యార్థికి రూ.150 నుంచి రూ.200 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కాస్మొటిక్ చార్జీలు రూ.25 నుంచిరూ.90 వరకు పెంచింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే జూన్ నుంచి పెంచిన చార్జీలు అమల్లోకి వస్తాయని పేర్కొంది.

మరింత మెరుగైన భోజనం

పెంచిన డైట్ చార్జీల వల్ల విద్యార్థులకు మరింత మెరుగైన భోజనాన్ని అందించే అవకాశం ఉంది. కాస్మొటిక్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. పేద, వెనుబడిన విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యనిందించాలనే లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది.
– జాకీర్‌హుస్సేన్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి

విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది

డైట్,కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచడం ద్వారా రానున్న విద్యా సంవత్సరం నుంచి వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం పెంచిన ఛార్జీలు వచ్చే జూన్ నుంచి అమలులోకి రానున్నాయి.
– సందప్ప, జిల్లా బీసీ సంక్షేమ అధికారి

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి



ముదివేడులో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి

కురబలకోట : గ్రామ పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ఆర్థిక వనరులు ముఖ్యం. వీటిలో కుళాయి, ఇంటి పన్నులు ప్రధాన వనరులు. ఈ నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దృష్ట్యా అన్నమయ్య జిల్లాలో నూరు శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ముదివేడు పంచాయతీ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డంపింగ్ యార్డును సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 65 శాతం పన్నులు వసూలు జరిగిందన్నారు. వంద శాతం లక్ష్యం కోసం అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. జిల్లాలో 501 పంచాయతీలు ఉండగా 439 వాటిలో డంపింగ్ యార్డులు ఉన్నాయన్నారు. మిగిలిన వాటిలో త్వరలో వీటిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సంపద కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువుల తయారు చేసి కిలో రూ.5 చొప్పున రైతులకు విక్రయించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో భూ రీసర్వే జరుగుతోందన్నారు. పంచాయతీ ఆస్తులను గుర్తించి తద్వారా ఆదాయ వనరుల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి ఆర్థిక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

పనితీరు మెరుగు పడాలి:

సచివాలయాల్లో ఉద్యోగుల పనితీరు మరింత మెరుగు పడాలని ఆమె సూచించారు. సమయపాలన పాటించాలన్నారు. సిబ్బంది, వాలంటీర్లు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ సహనాజ్ బేగం, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఇఓఆర్డీ అబ్దుల్ సుకూర్, సీడీపీఓ సుజాత, అంజాద్‌ఖాన్, కార్యదర్శి రామప్ప నాయుడు, శెట్టి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

రామాపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం అన్నమయ్య జిల్లా డీఎంహెచ్ఓ కొండయ్య తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, ఓపీని పరిశీలించారు. మండల ఆరోగ్య శాఖ పరిధిలోని కుమ్మరపల్లె పంచాయితీలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించి వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.వైద్యాధికారులు గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విజయకుమార్, వినోద్‌కుమార్, సీహెచ్ఓ ఎలైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులను ఆదరిద్దాం

లక్కిరెడ్డిపల్లి : క్షయవ్యాధి గ్రస్తులను దూరం పెట్టకుండా ఆదరించాలని డీఎంహెచ్ఓ కొండయ్య పేర్కొన్నారు. శనివారం దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 9 మంది క్షయవ్యాధి గ్రస్తులను దత్తత తీసుకుని, వారికి ప్రతినెలా పోషకాలు, మందులు ఉచితంగా అందజేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ కొండయ్య మాట్లాడుతూ ఏఎన్ఎంలు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ రియాజ్ బేగ్, ఎంపీహెచ్ఓ దేవదానం, జీఎన్ఎం సుజాత, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మదనపల్లె వైస్ ఎంపీపీ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మదనపల్లె వైస్ ఎంపీపీ నందిని తాజ్(37) శనివారం ఆత్మహత్యకు ప్రయత్నించింది. మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ బాబుకాలనీకి చెందిన నందినితాజ్ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీగా గెలుపొంది వైస్ ఎంపీపీగా కొనసాగుతున్నారు. కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపంతో క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్సలు అందించారు. నందినితాజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వారు తెలిపారు. కుటుంబ సభ్యులతో గొడవపడి క్షణికావేశంలో ఆత్మహత్యకు యత్నించినట్లు బంధువులు తెలిపారు. అవుట్ పోస్టు పోలీసు సిబ్బంది సమాచారాన్ని తాలూకా పోలీసులకు అందించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

దారి తప్పిన జింకపిల్ల అప్పగింత



జింకపిల్లను అటవీ అధికారులకు అప్పగిస్తున్న సీఐ వరప్రసాద్

గాలివీడు : దారి తప్పిన జింక పిల్లను అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ వరప్రసాద్ తెలియజేశారు. శనివారం ఉదయం గాలివీడు పట్టణం శెట్టివారిపల్లెలోని చిన్నప్పరెడ్డి మిషన్ వద్ద ఉన్న ఓ ఇంటిలోకి వచ్చిన జింక పిల్లను స్థానికుల సమాచారంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వెంటనే సీఐ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి జింక పిల్లను క్షేమంగా వారికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రఘురామయ్య, పోలీస్ సిబ్బంది, ఎఫ్ఎస్ఓ రెడ్డప్ప, ఎఫ్‌బీఓ కృష్ణ ప్రసాద్, సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ల ఆటకట్టు

- నాలుగు ప్రాంతాల్లో దాడులు
- మూడు ముఠాలకు చెందిన 18 మందితోపాటు మరొకరి అరెస్ట్
- 28 కిలోల గంజాయి, కారు, మూడు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్ స్వాధీనం
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

కడప అర్బన్ : గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు చేస్తున్న అంతర్ రాష్ట్ర స్మగ్లర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పోలీసు సిబ్బంది, ఎస్ఈబీ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. మైదుకూరు, కమలాపురం, కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిల్లో దాడులు నిర్వహించి, 18 మందిని అరెస్ట్ చేశారు. సిద్దవటంలో ఎస్ఈబీ వారి ఆధ్వర్యంలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 19 మందిని కటకటాల వెనక్కి పంపించారు. వారి వద్ద నుంచి 28 కిలోల గంజాయి, కారు, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ స్మగ్లర్లు ప్రధానంగా జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ అక్రమ రవాణా, అమ్మకాలు చేస్తున్నారు. కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జోరుగా సాగుతున్నాయని భావించి పోలీసులు నిఘా పెంచారు. కమలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్ రాష్ట్ర స్మగ్లర్లు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన ఎస్.కిరణ్‌కుమార్, జె.సందీప్, ప్రధాన రవాణా దారుడు కమలాపురం రామనగర్‌కు చెందిన పూజారి సాయి, అతని అనుచరుడు ఇందిరమ్మ కాలనీ నివాసి మునగా శివకుమార్, పైడిమాను కాలనీకి చెందిన స్థానిక విక్రయదారుడు, రవాణాదారుడు సోమేసుల వెంకట లక్ష్మమ్మ ముఠాగా ఏర్పడి గంజాయి కార్యకలాపాలు కొనసాగించారు. వారిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు.

■ కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలపల్లి మండలం వంగసారి నివాసి కొర్రా మత్స్యరాజు, అంతర్ జిల్లా గంజాయి అక్రమ రవాణా దారుడు నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన నట్వ చంద్ర శ్రీకాంత్, అతని అనుచరుడు కడప సాయిపేట నివాసి షేక్ అల్లాబకాష్, అతని స్నేహితుడు, కడప నగరం ప్రకాష్ నగర్‌కు చెందిన సాకే శంకర్, శ్రీకాంత్ స్నేహితుడైన మైదుకూరు మండలం గొల్లపల్లి నివాసి మధం సుష్మంత్ అనే ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

■ మైదుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో స్థానిక ప్రధాన గంజాయి స్మగ్లర్ మైదుకూరు టౌన్ విజయనగర్ కాలనీకి చెందిన భూమిరెడ్డి చిన్న చెన్నయ్యగారి పుల్లయ్య, అంతర్ జిల్లా గంజాయి స్మగ్లర్, 15 కేసుల్లో నిందితుడిగా వున్న మైదుకూరు మండలం కేశలింగాయపల్లికి చెందిన పసల వినోద్‌కుమార్‌తో పాటు స్థానికంగా విక్రయించే పెద్దక్క, పుల్లయ్యకు అనుచరుడైన మైదుకూరు టౌన్ శాంతినగర్‌కు చెందిన సయ్యద్ ఖాదర్ వల్లీ, బద్వేల్‌కు చెందిన స్థానిక గంజాయి విక్రయదారులు రాంబాబు, తిరుపతయ్య, మైదుకూరు టౌన్‌కు చెందిన రమేష్, ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన మస్తానమ్మ అలియాస్ గౌసియా అనే 8 మందిని అరెస్ట్ చేశారు. అలాగే సిద్దవటంలో ఎస్ఈబి వారి ఆధ్వర్యంలో స్థానిక గంజాయి విక్రయదారుడు కొండయ్యను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 19 మందిని అరెస్ట్ చేశారు. శనివారం తెల్లవారుజామున ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో పోలీసు అధికారులు, సిబ్బంది వీరిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయిని ఎవరైనా విక్రయించినా, కొనుగోలు చేసినా, సరఫరా చేసినా, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదే పదే ఇలాంటి నేరాలకు పాల్పడితే పి.డి యాక్ట్‌లను ప్రయోగిస్తామని హెచ్చరించారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ పూజిత నీలం, కడప ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ బి.నాగభూషణ్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాజా ప్రభాకర్, కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, మైదుకూరు సీఐ చలపతి, కమలాపురం సీఐ పి. సత్యబాబు, సిద్దవటం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఉరుకుందమ్మ, ఎస్ఐలు చిన్నపెద్దయ్య, మధుసూధన్‌రెడ్డి, పెద్ద ఓబన్న, గణమద్దిలేటి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుళ్లు శ్యామ్ సుందర్, మురళీమోహన్, రామకృష్ణతోపాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

గంజాయి సమాచారం ఇవ్వండి : ఎస్పీ

గంజాయి విక్రయాలు, వినియోగించే వారి సమాచారాన్ని ప్రజలు డయల్ 100కు గానీ, 94407 96900కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కోరారు. వైజాగ్ నుంచి రైళ్లు, కార్లలో రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం తాము గుర్తించిన గంజాయిని వినియోగిస్తున్న 30 మందికి కడప రిమ్స్‌లో రిహాబిలిటేషన్ కేంద్రం ద్వారా కౌన్సెలింగ్‌ను ఇప్పిస్తామని పేర్కొన్నారు.

పీలేరు వాసి శ్రీరంగపట్నంలో మృతి



శ్రీపురం ప్రదీప్ (ఫైల్)

పీలేరు : పీలేరు వాసి కర్ణాటక శ్రీరంగంపటణంలో ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. పీలేరు పట్టణంలోని ప్రకాష్ జువెలర్స్ అధినేత శ్రీపురం ప్రకాష్ కుమారుడు శ్రీపురం ప్రదీప్ (36) తన అమ్మమ్మ అస్తికలు నదిలో కలపడానికి కర్ణాటక రాష్ట్రం శ్రీరంగపట్నం వెళ్లారు. అక్కడ త్రివేణి సంగమం వద్ద ప్రమాదవ శాత్తు నదిలో పడి మృతి చెందాడు. ఆయనకు భార్యతోపాటు ఒక కుమారుడు ఉన్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి కేసు దర్యాప్తు ముమ్మరం

మదనపల్లె : మండలంలోని కోళ్లబైలు గ్రామం వాటర్‌ఫాల్స్ వద్ద శుక్రవారం బయటపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. అనుమానస్పద మృతిగా మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అందులో భాగంగా శనివారం సీఐ సత్యనారాయణ, ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలంలోనే మృతదేహానికి జిల్లా ఆస్పత్రి వైద్యులతో పోస్టుమార్టం చేయించారు. మృతుడి శరీరభాగాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)కు తరలించారు. డీఎన్ఏ రిపోర్టు అందిన తర్వాత ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న సీఐ సాదిక్ అలీ

ములకలచెరువు : ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘాను పెంచినట్లు సీఐ సాదిక్ అలీ తెలిపారు. శనివారం ఆయన పెద్దతిప్పసముద్రం మండలం మార్గానిపల్లి, అంకాలమడుగు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను పరిశీలించారు. కర్ణాటక నుంచి వచ్చేపోయే వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ములకలచెరువు సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో రెండు అంతర్‌రాష్ట్ర, ఒకటి అంతర్‌జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీలు నిర్వహించాలని ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అక్రమ మద్యం రవాణా, నాటుసారా తయారీని అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

స్కూటర్ ఢీకొని వృద్ధుడి మృతి

చాపాడు : చాపాడు మండలం పల్లవోలు గ్రామం వద్ద శనివారం రాత్రి స్కూటర్ ఢీకొని దోనాది రమణయ్య (65) అనే వృద్ధుడు మృతి చెందాడు. పల్లవోలు గ్రామం వద్ద మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై దోనాది రమణయ్య రోడ్డు దాటుతుండగా మైదుకూరు వైపు నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ నడుపుతున్న జతిన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో జతిన్‌ను ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బాలికల పట్ల హెచ్‌ఎం అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు
- హెచ్‌ఎంను సస్పెండ్ చేసిన అధికారులు



పిల్లల తల్లిదండ్రులను విచారిస్తున్న ఎంఈవో త్యాగరాజు

తంబళ్లపల్లె : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మొగిలీశ్వరయ్య తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయమై పిల్లలు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. వారు శనివారం పాఠశాలకు వచ్చి హెచ్‌ఎంను మందలించి, తీరుమార్చుకోవాలని దేహశుద్ధి చేశారు. సమాచారం తెలుసుకున్న ఎంఈవో త్యాగరాజు, సర్పంచ్ నీలూఫర్ పాఠశాల వద్దకు చేరుకున్నారు. తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించారు. హెచ్‌ఎం మొగిలీశ్వరయ్యను సస్పెండ్ చేస్తూ డీఈవో రాఘవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

వికలాంగ యువకుడి దారుణ హత్య

- మూటకట్టి బావిలో పడేసిన వైనం
- 15 రోజుల తరువాత బయటపడ్డ మృతదేహం



భాస్కర్ (ఫైల్)



బావిలో తేలియాడుతున్న శవం



మృతి చెందిన భాస్కర్

గుర్రంకొండ : వికలాంగ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ చింతమాకులపల్లెలో జరిగింది. అతన్ని హత్య చేసి మూటగట్టి బావిలో పడవేశారు. సుమారు 15 రోజుల తరువాత మృతదేహం తేలియాడుతూ కనిపించింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుంటి సిద్దయ్య, కుంటి రెడ్డెమ్మ కుమారుడు కుంటి భాస్కర్(40)కు మదనపల్లె మండలం గ్రామానికి చెందిన అనితతో ఏడేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి దేవి(5) అనే కూతురు ఉంది. కుటుంబ కలహాలతో కూతురుతో సహా భార్య అనిత కొంత కాలంగా పుట్టింట్లో ఉంది. భాస్కర్ తిరుమలలో పని చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల శివరాత్రి పండుగ రోజన గ్రామంలోని తన ఇంటికి వచ్చాడు. ఏం జరిగిందో తెలియదు కానీ ఆ మరుసటి రోజు నుంచి అతను కనిపించకుండా పోయాడు. అతను అప్పుడప్పుడు తల్లిదండ్రలకు చెప్పకుండానే తిరుమలకు వెళ్లేవాడు. దీంతో వారు ఇప్పుడు కూడా అలాగే వెళ్లింటాడు అని భావించారు. ఈ క్రమంలో శనివారం గ్రామానికి సమీపంలోని ఓ బావిలో గుర్తు తెలియని శవం మూటతో సహా తేలియాడుతూ కనిపించింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కలకడ సీఐ నాగేంద్ర, గుర్రంకొండ ఎస్ఐ దిలీప్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని బావిలో నుంచి బయటకు తీయించారు. మృతదేహంపై మెడ నుంచి మొకాలి వరకు డ్రిప్ పైపులతో బలంగా కట్టి సంచిలో ఉంచి, సంచిని మళ్లీ తాళ్లతో కట్టినట్లుగా ఆనవాళ్లు కనిపించాయి. హత్య జరిగి 15 రోజులు కావడంతో మృతదేహం మొత్తం ఛిద్రమైపోయింది. పోస్టుమార్టంలో వాస్తవాలు వెలుగు చూస్తాయని పోలీసులు అంటున్నారు. ఇప్పటికే డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశోధించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

21 కేజీల వెండి నగలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న వెండి నగలతో పోలీసులు

రాజంపేట : రాజంపేట–రాయచోటి మార్గంమధ్యలోని కూచివారిపల్లె వద్ద శుక్రవారం రాత్రి 21 కేజీల వెండి నగలు పట్టుకున్నారు. సీఐ నరసింహారావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. కలికిరి మండలానికి చెందిన రామచంద్రయ్య కారులో 21 కేజీల వెండి నగలు తీసుకొని వస్తుండగా పట్టుకున్నారు. వాటికి సంబంధించి సరైన పత్రాలు లేనందున పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. నగలను సంబంధిత అధికారులకు అందజేశారు. తనిఖీల్లో ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐలు రాజు, నరసింహులు, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని బొల్లవరంలో నివాసం ఉంటున్న వెంకటశ్వేత (24) అనే యువతి శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. వెంకటశ్వేత బీటెక్ పూర్తి చేసి రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోంలో భాగంగా ఇంటి నుంచే విధులు నిర్వహిస్తోంది. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి పని ఒత్తిడి ఎక్కువగా ఉందని తల్లిదండ్రులకు చెబుతూ బాధపడేది. ఉద్యోగం మానేస్తే స్నేహితుల మధ్య బాగుండదని భావించి పని చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో బాత్రూంలోకి వెళ్లిన ఆమె చాలా సేపయినా బయటికి రాలేదు. తల్లిదండ్రులు ఎంత పిలిచినా శ్వేత పలకలేదు. దీంతో తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లగా ఆమె ఉరికి వేలాడుతోంది. వెంటనే యువతిని కిందికి దించి ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపాడు. తండ్రి సహదేవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

హార్సిలీహిల్స్ అడవిలో మంటలు

- మొగసాలమర్రి గుట్టలు దగ్ధం
- మంటలార్పేందుకు అష్టకష్టాలు



మొగసాలమర్రి గుట్టలపై ఎగసి పడుతున్న మంటలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలో శనివారం మధ్యాహ్నం కొండలు, గుట్టలకు నిప్పు పెట్టడంతో ఆర్పేందుకు అటవీశాఖ సిబ్బంది అష్టకష్టాలు పడ్డారు. వివరాల్లోకి వెళితే.. పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ కొత్త వ్యూపాయింట్ సమీపంలో ఆకతాయిలు సిగరెట్ తాగి పొదల్లో పడేయడంతో మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకొన్న అటవీ సిబ్బంది వెంటనే ఆర్పేయడంతో ప్రమాదం తప్పింది. అలాగే హార్సిలీహిల్స్ అడవి మొగసాలమర్రి వైపు కొందరు నిప్పు పెట్టుకుంటూ వెళ్లడంతో కొంత అటవీ ప్రాంతం కాలిపోయింది. నిప్పు పెట్టిన చోట నడకదారి ఉండటంతో మంటలు అక్కడితో ఆగిపోయాయి. హార్సిలీహిల్స్ అడవికి అనుకుని ఉన్న మొగసాలమర్రి గుట్టలకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగసిపడుతూ కొండలన్నీ కాలిబూడిదయ్యాయి. కాండ్లమడుగు బీటు అధికారి చిట్టిబాబు, సిబ్బంది బద్రినాథ్, గణేష్, రమణ తదితరులు మంటలు ఆర్పేందుకు ఇబ్బందులు పడ్డారు. సంచుల్లో తీసుకెళ్లిన వాటర్ ప్యాకెట్లతో మంటలపై నీళ్లు చల్లుతూ ఆర్పడానికి ప్రయత్నించారు. కాగా గట్టు–గట్టపాళ్యం మధ్యలోని కొండలు అగ్నికి ఆహుతయ్యాయి. చలిమామిడి రోడ్డులోని గుట్టలు పూర్తిగా కాలిపోయాయి.

దేవాలయ భూములు దుర్వినియోగం కాకుండా చర్యలు

- భూముల వేలంతో వచ్చే ఆదాయంతో ఆలయాల అభివృద్ధి
- దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్



మాట్లాడుతున్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్

రామసముద్రం : దేవాలయ భూములు దుర్వినియోగం కాకుండా, త్వరలోనే సర్వే చేయించి వేలం పాట నిర్వహిస్తామని అన్నమయ్య జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. శనివారం ఆయన రామసముద్రం మండలం బల్లసముద్రం సమీపంలోని కొండపై ఉన్న శ్రీవాలీశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి రోజు అర్చకునిపై జరిగిన దాడి విషయమై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయ పూజ కైంకర్యాలు వంశపారం పర్యంగా వస్తున్న అర్చకులు లోకనాథ్ దీక్షిత్ హక్కు అన్నారు. ఆలయ భూముల ఆదాయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. అలాగే వాలీశ్వరస్వామి ఆలయానికి సుమారు 120 ఎకరాల భూములను రామసముద్రం చంద్రశేఖరస్వామి ఆలయానికి చెందిన భూములను త్వరలోనే సర్వే చేయించి హద్దులు గుర్తించేందుకు తిరుపతి దేవదాయ డిప్యూటీ కలెక్టర్‌కు నివేదించామని తెలిపారు. అలాగే రామసముద్రం తహసీల్దార్ దేవరాజన్‌కు సర్వే చేసేందుకు విన్నవించామన్నారు. సర్వే చేసి భూములను వేలం పెట్టి వచ్చిన ఆదాయంతో ఆలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కొండకు రూ.7.50 కోట్లతో త్వరలో రోడ్డు నిర్మాణం చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈవో వెంకటరమణ, కార్యదర్శి అంకన్న, సర్పంచ్‌లు ఆదినారాయణ, ఉదయ్‌శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ రెడ్డిశేఖర్, గ్రామస్తులు విశ్వనాథరెడ్డి, గంగప్ప, అనిల్‌రెడ్డి, సిహెచ్ ప్రకాష్, మంజునాథ, చిన్నవాలెప్ప తదితరులు పాల్గొన్నారు.